కాలుష్య కాటు!

ఆ ప్రాంతం కాలుష్యమవుతోంది. నిత్యం వెదజల్లుతున్న దుమ్ము వల్ల ప్రజలు అవస్థలు పడుతున్నారు. బొగ్గు నుంచి వచ్చే ధూళితో జలాలు కలుషితమవుతున్నాయి. ఫలితంగా ప్రజల ఆరోగ్యానికి ముప్పు పొంచి ఉంది. అలాంటి ప్రమాదకర కంపెనీని తక్షణమే మూసివేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


కోక్ నిల్వలు ఉంచిన గొడౌన్

- ప్రధాన కాలువ ఆక్రమించి గొడౌన్ నిర్మాణం
- భారీగా గ్రీన్ పెట్రోలియం కోక్ (జీపీసీ) నిల్వలు
- కలుషితమవుతున్న జలాలు
- ప్రజల ఆరోగ్యంపై ప్రభావం


రంగుమారిన నీరు

అక్కిరెడ్డిపాలెం: మింది నుంచి షీలానగర్ టోల్ గేటుకు వెళ్లే పోర్టు రోడ్డులో సాన్విరా అనే ప్రైవేట్ యాజమాన్యం గొడౌన్ నిర్మించి గ్రీన్ పెట్రోలియం కోక్ (జీపీసీ) నిల్వ చేస్తోంది. దీని వల్ల పర్యావరణంతో పాటు తమకు ముప్పు వాటిల్లే విధంగా ఉందని సమీప గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కంపెనీ అనుమతులు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

మింది, అక్కిరెడ్డిపాలెం గ్రామాలను అనుకొని విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ స్థలాలకు సమీపంలో ఏర్పాటు చేసిన భారీ గొడౌన్లలో గ్రీన్ పెట్రోలియం కోక్ నిల్వ చేస్తున్నారు. చమురు శుద్ధి ఉప ప్రక్రియ అయిన కోక్(బొగ్గు) ఘనమైన నలుపు, నాన్ రియాక్టివ్, నాన్ పేలుడు గుణం కలిగి ఉంటుంది. నీటిలో కరగని ఈ ఉత్పత్తి గొడౌన్‌లో భారీ మొత్తంలో నిల్వ చేయడంతో దుమ్ము, వాయు కాలుష్యం ఏర్పడుతుంది. దీన్ని పీల్చితే అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని నిపుణులు సైతం హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే ఉన్న పరిశ్రమల కారణంగా మింది, అక్కిరెడ్డిపాలెం, ఇతర చుట్టు పక్కల గ్రామాల్లో సుమారు 50 వేల మంది కాలుష్య సమస్యతో సతమతమవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మరో కాలుష్య కంపెనీని తాము భరించలేమని ప్రజలు స్పష్టం చేస్తున్నారు.

డ్రైనేజీలు ఆక్రమించి గొడౌన్ల నిర్మాణం!

మింది, అక్కిరెడ్డిపాలెం గ్రామాల నుంచి వెళ్లే ప్రధాన డ్రైనేజీలపై సాన్విరా గ్రూపునకు చెందిన గొడౌన్లు నిర్మించారని ప్రజలు ఆరోపిస్తున్నారు. దాని వల్లే డ్రైన్లలో మురుగునీరు నిలిచి పోయి ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు.


డ్రైన్‌లో నిలిచిపోయిన మురుగు

ధూళి, వాయు కాలుష్యం వెదజల్లే ఈ కంపెనీ కార్యకలాపాలను నిలిపి వేయాలని కోరుతున్నారు. యాజమాన్యం కాని మొండి వైఖరి విడనాడకపోతే ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరిస్తున్నారు.

అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలి



గ్రీన్ పెట్రోలియం కోక్ అనేది చమురు శుద్ధి చేయడానికి ఉప ఉత్పత్తి. అవి పూర్తిగా రసాయనాలతో కూడి ఉంటాయి. వీటి వల్ల పరిసర ప్రాంతాలైన మింది, అక్కిరెడ్డిపాలెంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు స్పందించి గొడౌన్లలో నిల్వ ఉన్న ఉత్పత్తులను తరలించాలి. ఇక్కడ కార్యకలాపాలు నిలిపివేయించాలి.

–గుడివాడ అనూష, 68వ వార్డు కార్పొరేటర్

అనారోగ్య సమస్యలతో సతమతం



మింది, అక్కిరెడ్డిపాలెం గ్రామాల ప్రజలు ఇప్పటికే ఏటీఆర్ గొడౌన్లు , శ్రావణ్ షిప్పింగ్ నుంచి వచ్చే పౌడర్ వంటి పదార్థాలు నివాసాలపై పడడం వల్ల వాటిని పీల్చి చాలామంది అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇప్పుడు పెట్రోలియం ఉత్పత్తుల గొడౌన్ల వల్ల నీరు కలుషితమవుతోంది. తక్షణమే ఇక్కడి గొడౌన్లలో ఉన్న నిల్వలను తొలగించాలి.

–సంద్రాన నూకరాజు, అక్కిరెడ్డిపాలెం గ్రామ నాయకుడు

క్లుప్తంగా

తాగునీరు వృథా


వాల్వ్ వద్ద వృథాగా పోతున్న తాగునీరు

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు కోరాడ ప్రధాన రహదారిలో ఉన్న జీవీఎంసీ వాల్వ్ నుంచి తాగునీరు వృథాగా పోతుంది. జీవీఎంసీ నీటి సరఫరా అధికారులు, సిబ్బంది ప్రతి రోజూ ఇదే మార్గం ద్వారా రాకపోకలు సాగిస్తారు. కాని ఇక్కడ వేల లీటర్లు నీరు వృథాగా పోతున్నా పట్టించకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలో మూడు రోజుల నుంచి తాగునీరు సరఫరాలో సమస్య ఉంది. కొన్ని చోట్ల సరఫరా ఉంటే, మరికొన్ని వార్డుల్లో సరఫరా లేదు. వెంటనే అధికారులు స్పందించి మరమ్మతులు నిర్వహించి తాగునీటి వృథాను అరికట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

'మంచి మనిషి రాజా'


రాజా చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు

పెదగంట్యాడ: గాజువాక మున్సిపల్ మాజీ చైర్మన్ వీవీఎస్ఎం రాజా సేవలు మరువలేమని మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, తిప్పల గురుమూర్తిరెడ్డి అన్నారు. వీవీఎస్ఎం రాజా అకాల మరణాన్ని చింతిస్తూ స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం రాజా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తిప్పల దేవన్‌రెడ్డి, మార్టుపూడి పరదేశి, పల్లా చినతల్లి, కొయ్య భారతి, గొందేశి మహేశ్వరరెడ్డి, మంత్రి శంకరనారాయణ, శ్రీనివాస్ గౌడ్, పల్లా పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ చార్జీలపై హైకోర్టుకు సీఐటీయూ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో నివసిస్తున్న కార్మికుల నివాస గృహాల కరెంట్ చార్జీలను యాజమాన్యం పెంచడాన్ని నిరసిస్తూ సీఐటీయూ నాయకులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసుకు సంబంధించి నాలుగు వాయిదాలకు యాజమాన్యం తరఫున న్యాయవాదులు హాజరు కాలేదు. ఈ నెల 24న జరిగిన వాయిదాకు హాజరైన స్టీల్‌ప్లాంట్ న్యాయవాది కొంత సమయం కావాలని కోరారు. దీంతో హైకోర్టు అక్టోబర్ 22కు వాయిదా వేసినట్టు సీఐటీయూ నాయకులు తెలిపారు.

సీపీఎం, జేవీవీ నాయకుల శ్రమదానం


శ్రమదానం చేస్తున్న సీపీఎం సభ్యులు

గాజువాక: సీపీఎం జోగవానిపాలెం శాఖ సభ్యులు, జన విజ్ఞాన వేదిక (జేవీవీ) నాయకులు 67వ వార్డు హైస్కూల్ రోడ్ శ్మశాన వాటికలో బుధవారం శ్రమదానం చేశారు. జీవీఎంసీ ప్రజారోగ్య సిబ్బందితో కలిసి శ్మశానంలో చెత్త, పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.రమేష్ కుమార్, కె.కిరీటం, కె.సంతోషం, కె.పి.కుమార్, పాలూరు లక్ష్మణస్వామి, మధు తదితరులు పాల్గొన్నారు.

8వ పే కమిషన్ ఏర్పాటు చేయాలి

సీతమ్మధార: 8వ పే కమిషన్ వెంటనే ఏర్పాటు చేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆల్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ పార్కులో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు పెన్షనర్లు మాట్లాడుతూ ఎన్‌పీఎస్ రద్దు చేయాలని, ఓపీఎస్ పునరుద్ధరించాలని, బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల పెన్షన్‌ను అప్డేట్ చేయాలన్నారు. కమ్యూటేషన్ రికవరీ కాలాన్ని 15 సంవత్సరాల నుంచి 12 సంవత్సరాలకు తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు రిటైర్డు ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ చొరవతో పీఎఫ్ సర్వీసు క్రమబద్ధీకరణ


సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకుడు వెంకటరావు

ఉక్కునగరం: కర్ణాటకకు చెందిన ఏఐటీయూసీ నాయకుల చొరవతో స్టీల్‌ప్లాంట్ ఆర్ఈడీ కాంట్రాక్ట్ కార్మికుల పీఎఫ్ సర్వీసు క్రమబద్ధీకరణ జరిగిందని ఏఐటీయూసీ ఏపీ కౌన్సిల్ సభ్యుడు బి. వెంకటరావు తెలిపారు. ఎస్ఎంఎస్ విభాగంలో బుధవారం నిర్వహించిన ఆర్ఈడీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2021లో రిఫ్రాక్టరీ కాంట్రాక్టర్ వర్షిణి ఎంటర్‌ప్రైజెస్ తనకు వర్క్ ఇచ్చిన రాశీ రిఫ్రాక్టరీస్‌తో తగాదా పడి ఆ ఏడాది మేలో ఆ పని నుంచి అర్ధాంతరంగా వైదొలిగిందన్నారు. అయితే కార్మికుల పీఎఫ్ ఖాతాలో వైదొలగిన తేదీని ఉద్దేశపూర్వకంగా ఆగస్టు అని తప్పుగా నమోదు చేయడంతో హుబ్లీ పీఎఫ్ ఆఫీసులో 50 మంది కార్మికుల 12 ఏళ్ల పీఎఫ్ సీనియార్టీ, రూ. 2 కోట్ల భవిష్యనిధి స్తంభించిపోయాయన్నారు. దీంతో హెచ్ఆర్ అధికారి రాజేశ్వరరావు, సైటు లీడర్లు రాజు, నాయుడు, నమ్మి అప్పారావును కర్ణాటక రాష్ట్రంలోని హుబ్లీ తీసుకువెళ్లి అక్కడి ఏఐటీయూసీ నాయకులు భగవతి, ఉమేష్, అబ్దుల్ పీర్ జావేద్‌ల సాయంతో అక్కడి ప్రాంతీ పీఎఫ్ కమిషనర్ రామ్ కేశ్ మీనాకు ఫిర్యాదు చేశామన్నారు. వారికి అవసరమైన పత్రాలు అందించిన వారం రోజుల్లోనే సమస్య పరిష్కారం అయిందన్నారు. ఈ అంశంలో సహకరించిన కర్ణాటక ఏఐటీయూసీ నాయకత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డి. చంద్రరావు, డి. జగ్గారావు, రామునాయుడు, అప్పలనరసమ్మ, తోకాడ అప్పారావు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలని టీఎంసీ కార్మికుల ధర్నా


ధర్నాలో పాల్గొన్న టీఎంసీ కార్మికులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఆర్ఎంహెచ్‌పీ విభాగంలోని టీఎంసీ కార్మికులకు ఆగస్టు నెల జీతాలు చెల్లించాలని స్టీల్ సీఐటీయూ కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం విభాగాధిపతి కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ విభాగంలో పునిక్స్, మాస్, నాగార్జున కాంట్రాక్టర్ల వద్ద సుమారు 500 మంది కార్మికులు పని చేస్తున్నారన్నారు. వారికి ఇప్పటి వరకు జీతాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందిపడుతున్నారన్నారు. యాజమాన్యం జోక్యం చేసుకుని జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జి.శ్రీనివాసరావు, పి. మసేను, నమ్మి సోమునాయుడు, డి.ఎస్.వి. శ్రీనివాసరావు, బి.ఆనంద్, బంగాయ్య పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో ప్రతిభ


విజయం సాధించిన అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో ఉపాధ్యాయులు

అక్కిరెడ్డిపాలెం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ విద్యార్థులు సత్తా చాటుతున్నారు. గాజువాక జిల్లా పరిషత్ హై స్కూల్‌లో బుధవారం జరిగిన నియోజకవర్గ స్థాయి పోటీల్లో అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ బాల, బాలికలు కోకోలో అండర్ 14, 17 విభాగాల్లో పెదగంట్యాడ జిల్లా పరిషత్ హై స్కూల్‌పై విజయం సాధించారని అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హై స్కూల్ పీడీ ఇస్మాయిల్ తెలిపారు. వీరు త్వరలో జరగబోయే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. విజయం సాధించిన జట్లకు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, 68వ వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష, లతీష్‌లు, పాఠశాల హెచ్ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం తదితరులు అభినందనలు తెలిపారు.

రెండు ఆస్పత్రులను తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో


రెయిన్‌బో ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి. జగదీశ్వరరావు ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం బుధవారం హెల్త్ సిటీలో గల రెయిన్‌బో, స్టార్ పినాకిల్ ఆస్పత్రులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడి అల్ట్రాసౌండ్ స్కానింగ్‌కు రిజిస్ట్రేషన్ ఉన్నదీ లేనిదీ తనిఖీ చేశారు. ఫారం–ఎఫ్ ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేస్తున్నారో లేదో పరిశీలించారు. 5 శాతం ఉచిత స్కానింగ్‌లు చేస్తున్నదీ లేనిదీ ఆరా తీశారు. 5 శాతం ఉచిత స్కానింగ్‌కు విడిగా రిజిస్టర్ నిర్వహించాలని, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని తెలిపే సైన్ బోర్డు ప్రతి స్కానింగ్ సెంటర్‌లో ఉండాలన్నారు. గైనకాలజిస్ట్, రేడియాలజిస్ట్ తప్పని సరిగా ఉండాలని, డాక్టర్ల అర్హత సర్టిఫికెట్లు స్కానింగ్ సెంటర్లలో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రేవిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ప్రతి ఒక్క ఏఎన్ఎం వ్యాక్సినేషన్ రోజున ముందుగా లబ్ధిదారుల జాబితా దగ్గర పెట్టుకోవాలని, ఆ జాబితా ప్రకారం వ్యాక్సిన్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. పరిసరాలు క్లోరినేషన్ చేయాలని, మంచి నీరు లేదా కాచి చల్లార్చిన నీటిని తాగాలని, దోమలు, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, మురుగు కాల్వలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయించుకోవాలని, దోమ తెరలు వాడాలని ప్రజలకు అవగాహన కల్పించాలని ఆరోగ్య సిబ్బందికి తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

అక్కిరెడ్డిపాలెం: మింది విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జోన్ – 2 ఈఈ బి.కె.నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాతయ్యపాలెం, కిమ్స్ ఐకాన్, సిగ్నేచర్ హోటల్ పరిసరాలు, ఐయాన్ డిజిటల్ పరీక్షా కేంద్రం పరిసరాల్లో ఆ రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

బీసీల ద్రోహి కృష్ణయ్య

అగనంపూడి: ఢిల్లీ స్థాయిలో బీసీల గొంతు వినిపిస్తారని నమ్మి బీసీల ప్రతినిధిగా ఆర్.కృష్ణయ్యను రాజ్యసభకు పంపిస్తే కృష్ణయ్య పార్టీ ఫిరాయించి బీసీల ద్రోహిగా చరిత్రకెక్కారని ఆంధ్రప్రదేశ్ యాదవ హక్కుల పరిరక్షణ వేదిక అధ్యక్షుడు యలమంచిలి అప్పారావు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రోమాల గణేశ్వరరావు ఆరోపించారు. అగనంపూడిలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కృష్ణయ్య లాంటి వ్యక్తిని నమ్మి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజ్య సభకు పంపితే విలువలకు తిలోదకాలిచ్చి వెన్నుపోటు పొడవడం దారుణమన్నారు. వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దంత పరీక్షలు


విద్యార్థులను పరీక్షిస్తున్న డాక్టర్ సత్యశ్రీ

పెదగంట్యాడ: జీవీఎంసీ 73వ వార్డు సింహగిరి కాలనీ ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు బుధవారం యాపిల్ ఇంటర్నేషనల్ దంత వైద్యాలయం డాక్టర్ సత్యశ్రీ దంత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నతనం నుంచే దంత ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు.కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అబ్దుల్ హక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న ఎక్సైజ్ ఎస్ఐ మోహనరావు

మహారాణిపేట: భవిష్యత్తును నాశనం చేసే మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.మోహన్‌రావు అన్నారు. బుధవారం ఎంవీపీ కాలనీ ఏఎస్ రాజా మహిళా జూనియర్ కాలేజీలో సెట్విస్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వినియోగం, మహిళల అక్రమ రవాణా, సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఒక వ్యక్తి చెడు వ్యసనాలకు అలవాటు పడితే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్నేహితులు ఎప్పటికప్పుడు వారిని గమనించాలన్నారు. ఏఎస్ రాజా మహిళా జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.కాసు మాట్లాడుతూ చెడు వ్యవసనాలకు అందరూ దూరంగా ఉండాలని, సైబర్ మోసాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలను చేపట్టడం ద్వారా విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సెట్విస్ మేనేజర్ ఎస్.వెంకటేష్, జూనియర్ కాలేజీ అధ్యాపకులు జి.వర లక్ష్మి, ఎం.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అర్చకులకు సత్కారం


అర్చకులు, అతిథులను సత్కరిస్తున్న బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధులు

అగనంపూడి: జిల్లాలోని ప్రధాన ఆలయాల అర్చకులను బుధవారం ప్రజాపిత బ్రహ్మకుమారీస్ సంస్థ అగనంపూడి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అగనంపూడిలోని దివ్యజ్యోతి భవనం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ దైవ సమానులుగా భావించే బ్రాహ్మణులను సత్కరించడం దేవుని సేవలో తరించడమే అవుతుందన్నారు. మౌంట్ అబూ ప్రతినిధి రాజయోగి బీకే మంజూనాథ్ మాట్లాడుతూ అగనంపూడి శాఖ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలతోపాటు ప్రజా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండడం ఆనందంగా ఉందన్నారు. జిల్లాలోని ప్రధాన ఆలయాల అర్చకులు 92 మందిని సత్కరించారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ జిల్లా ఇన్‌చార్జ్ బీకే వేణి అక్కయ్య, జిల్లా కోఆర్డినేటర్ సోమేశ్వరి అక్కయ్య, వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర సమాజంలో ఫార్మసిస్ట్‌ల పాత్ర కీలకం



మాట్లాడుతున్న డ్రగ్స్ అండ్ కంట్రోల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అథారిటీ ఏడీ విజయ్‌కుమార్

అగనంపూడి: ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో ఫార్మసిస్ట్‌ల పాత్ర కీలకమైందని డ్రగ్స్ అండ్ కంట్రోల్ లైసెన్సింగ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ సావరపు విజయ్‌కుమార్ అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఫార్మా కళాశాలలో ప్రపంచ ఫార్మసిస్ట్‌ల దినోత్సవం సందర్భంగా గ్లోబల్ హెల్త్ నీడ్స్‌పై రెండు రోజుల సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఔషధ భద్రతను నిర్ధారించడం, ఆరోగ్య సంరక్షణ వంటి అంశాల్లో ఫార్మసిస్ట్‌లు పాత్రను వివరించారు. కార్యక్రమంలో విశాఖ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, విజ్ఞాన్ ఫార్మా కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు చీరల పంపిణీ


చీరలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, తిప్పల గురుమూర్తిరెడ్డి

పెదగంట్యాడ: తల్లిదండ్రుల వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, తిప్పల గురుమూర్తిరెడ్డి అన్నారు. జీఏఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ గొందేశి అప్పలరెడ్డి, శ్రీదేవి ఆధ్వర్యంలో గొందేశి అప్పలరెడ్డి, అప్పయమ్మల 9వ వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 100మంది పేద మహిళకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గాజువాక పరిశీలకుడు తిప్పల దేవన్‌రెడ్డి,తిప్పల విజయమ్మ, పులి సురేష్ రెడ్డి, పరదేశి, చినఅప్పారావు,గౌతమ్‌రెడ్డి, పృథ్వీ, కొయ్య భారతి, పిట్టారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

దీన్‌దయాళ్‌కు ఘన నివాళి


దీన్‌దయాళ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

గాజువాక: బీజేపీ సిద్ధాంతకర్త పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయకు ఆ పార్టీ నాయకులు బుధవారం ఘన నివాళులర్పించారు. 72వ వార్డులో నిర్వహించిన దీన్ దయాళ్ జయంతి కార్యక్రమంలో ఆయన చిత్ర పటానికి బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ పాశ్చాత్య సిద్ధాంతాలకు ప్రత్యామ్నాయంగా, భారతీయ విలువలకు ప్రతిరూపంగా దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అందించిన సిద్ధాంతం స్ఫూర్తి దాయకమన్నారు. ఆయన సిద్ధాంతాలకనుగుణంగా ప్రధానమంత్రి మోదీ పాలన సాగుతోందన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గూటూరు శంకరరావు, రామస్వామి, మనోహర్, రాము నాయుడు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

అగనంపూడి: అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో వంద ప్రజాహిత కార్యక్రమాలు నిర్వహించామని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 85వ వార్డు పినమడకలో బుధవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పింఛన్ పెంపు, డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో ఇల్లపు వరలక్ష్మి, ప్రసాద్, కర్రి దశేంద్ర, గవర సోమశేఖర్, కోసూరి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా గణపతి నిమజ్జనోత్సవం


గణపతిని పురవీధుల్లో ఊరేగిస్తున్న నిర్వాహకులు


గణపతి ముందు కోలాటం చేస్తున్న చిన్నారులు

పెదగంట్యాడ: వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా గణపతి అనుపు ఉత్సవాలను మండలంలో బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. జీవీఎంసీ 75వ వార్డు నెల్లిముక్కు ధర్మాలవీధిలో పెంటమాంబ యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన విఘ్నేశ్వరుడికి విశేష పూజలు చేశారు. గతవారం 5వేల మందికి అన్నదానం చేశారు. అనుపు ఉత్సవంలో భాగంగా పెద్ద ఎత్తున మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల మధ్య గణపతిని పురవీధుల్లో ఊరేగించారు. కోలాటాలు, సాము గరిడీలు, నేల వేషాలతో యారాడ తీరంలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు ఎల్లయ్యరెడ్డి, పిట్ట రమణ,కామిరెడ్డి,భాను శంకర్‌రెడ్డి, సుమన్‌రెడ్డి,నీలాపు శ్రీనివాసరెడ్డి, అప్పలరెడ్డి, రామ్మోహన్‌రెడ్డితో పాటు పెద్ద ఎత్తున యువకులు, మహిళలు పాల్గొన్నారు.

గుజరాతీ కార్పొరేట్ వలస దోపిడీని ఎదురిద్దాం


జీవీఎంసీ గాంధీ పార్కులో దీక్షలో పాల్గొన్న వెంకటరెడ్డి తదితరులు

సీతమ్మధార: గుజరాతీ కార్పొరేట్ వలస దోపిడీని ఎదిరిద్దామని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గౌరవ అధ్యక్షుడు పి. వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. జీవీఎంసీ గాంధీ పార్కులో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న దీక్షకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది ప్రాణత్యాగంతో ఆవిర్భవించిన ప్లాంట్‌ను అప్పనంగా బడా వ్యాపారులకు విక్రయించేందుకు మోదీ ప్రభుత్వం పన్నుతున్న కుట్రలను తిప్పికొట్టాలన్నారు. అంబానీ, రిలయన్స్ తదితర ఉత్పత్తులను బహిష్కరిస్తామని హెచ్చరించారు. ఆనాడు సీపీఎం, సీపీఐ ఎమ్మెల్యేలు, ఎంపీలు రాజీనామాలు చేసి స్టీల్‌ప్లాంట్ సాధనకు కృషి చేశారన్నారు. ఈ రోజు ప్లాంట్‌ను ప్రైవేట్ పరం చేస్తే తగిన విధంగా బుద్ధి చెబుతామన్నారు. స్టీల్ ప్లాంట్ లేని విశాఖ నగరాన్ని ఊహించుకోలేమన్నారు. ఈ కార్యక్రమంలో రమణ, శ్రావణ్ పాల్గొన్నారు.